నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 27 మార్చి 2024 | KARIMNAGAR

ఇల్లంతకుంట, ఎండిన వరిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- వెంటనే వరదకాలువకు నీటిని విడుదల చేయాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్
- ఇల్లంతకుంట, గంగాధర మండలాల్లో ఎండిన పంటల పరిశీలన

ఇల్లంతకుంట/ గంగాధర, మార్చి 26 : కాళేశ్వరం ప్రాజెక్టును తప్పు పట్టేందుకు కాంగ్రెస్ సర్కారు సృష్టించిన కరువులో రైతులు బలవుతున్నారని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, గంగాధర మండలం ఆచంపల్లి వద్ద ఎండిపోయిన వరదకాలువను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ చొప్పదండి ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఇల్లంతకుంట మండలంలో పలు గ్రామాల్లో బైక్‌పై వెళ్లి పంటలను పరిశీలిస్తూ రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రాష్ట్రంలో సాగు, తాగు నీటి కొరత లేకుండా చేసిందని గుర్తు చేశారు. ఓర్వలేక కుట్ర పన్నిన కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ ప్రాజెక్టు లీకేజీ పేరుతో గోదావరి నీటిని సముద్రం పాలు చేసిందని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని ఖమ్మం వరకు తీసుకెళ్లి ఇల్లంతకుంట మండలాన్ని ఎడారిగా మార్చిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాతనే రైతులు యాసంగి పంటలు వేశారని, వారికి చుక్క నీరు ఇవ్వకుండా, ప్రాజెక్టుల్లో నీరు లేకుండా చేసి పంటలు ఎండేందుకు కారణమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రం రాక ముందు కాంగ్రెస్ పాలనలో ఎంత ఇబ్బంది పడ్డారో మళ్లీ ఇప్పుడు అలాగే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానకే నష్టం కాదని, పంటకు నీరు అందించలేక పోయినా నష్టమేనని, నష్ట పోయిన, ఎండిన ప్రతి ఎకరాకు రూ.15 వేల పరిహారం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజులకే రాష్ట్రంలో 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధకరమని ఆవేదన చెందారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు పచ్చని పంట పొలాలు వేసుకుని సుఖఃసంతోషాలతో ఉండడం చూడ లేకనే మార్పు పేరుతో వారిని కాంగ్రెస్ సర్కారు నట్టేట ముంచిందన్నారు.

వరదకాలువకు నీటిని విడుదల చేయాలి

వరదకాలువకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో వరదకాలువ ఎట్లుండేదని, ఇప్పుడెట్లున్నదని రైతులను అడుగగా, కేసీఆర్ సర్కారులో ఏడాది పొడవునా నీళ్లు ఉండేవని, రంది లేకుంట పంటలు పండించుకునేటోళ్లమని, ఇప్పుడు నీళ్లు లేక తిప్పలు పడుతున్నట్లు వారు వివరించారు. ఒకప్పుడు 365 రోజులు వరదకాలువ జీవనదిలా పారిందని, కాంగ్రెస్ సర్కారు వచ్చాక చుక్కనీరు లేక ఎడారిగా మారిందని వినోద్‌కుమార్ తెలిపారు. ఆయాచోట్ల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, ఎంపీటీసీ గొట్టెపర్తి పరశురాం, మాజీ సర్పంచ్ బిళ్ళవేణి పరశురాం, నాయకులు గుండ ముత్తయ్య, కేవీఎన్ రెడ్డి, గాదె కనుకయ్య, జక్కుల నాగరాజు ఉన్నారు.



ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో ఎండిన వరి పొలంలో ఎడ్లు

నీళ్లియ్యకపోతే మూడు లక్షలు మునుగుడె అయితది

నేను ఇరువై ఏండ్ల సంది ఎవుసం చేస్తన్న. నా కరెంట్ మోటారు పారకం బొక్కలవాగుకు ఉంటది. సీఎం వైఎస్సార్ ఉన్నప్పుడు కరెంట్ సక్కగ లేక పొలాలు ఎండిపోయినయంటే మళ్ల ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక ఎండి పోతున్నయి. అప్పటి లెక్కనే కరెంట్, సాగునీటి గోసలు మొదలయినయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ బాధాలేకుంట సాగు చేసుకున్నం. సరిపడా కరెంట్, నీళ్లు ఇచ్చిన్రు. కాంగ్రెస్ ప్రభుత్వం మేము నీళ్లు ఇస్తం, కరెంట్ ఇస్తం అని చెప్పి ఇట్ల మమ్ములను ఆగం చేసింది. రోజుకు వెయ్యి రూపాయల డిజిల్ కోసం ఖర్చు చేసిన కూడా ఒక్క దొయ్య కూడా పారుతలేదు. కరెంట్ ఉన్నప్పుడు నీళ్లు అస్తలేవు. నీళ్లు ఉన్నప్పుడు కరెంట్ అత్తలేదు. నేను రూ. 3లక్షల అప్పు తెచ్చి మల్లెపల్లిలో పదెకరాలు సాగు చేసిన. నీళ్లు లేక పంటలు ఎండి పోతనయి. ఇప్పుడు నీళ్లు ఇయ్యక పోతే నేను రూ.3లక్షలు మునుగుడె. మాకు ఇంకో ఇరువై రోజులు నీళ్లిస్తే ఈ ప్రాంత రైతుల పంట పొలాలన్నీ పండుతయి. లేకుంటే మేమంతా మందు తాగి సచ్చుడే అయితది.

- గోసికె శంకర్, రైతు, మల్లేపల్లి (మంథని)

రోడ్డెక్కిన రైతన్న

- సాగునీటి కోసం ఆందోళనలు
- మంథని, కొండన్నపల్లిలో రాస్తారోకోలు
- వందలాదిగా తరలివచ్చి నిరసన
- నీళ్లిచ్చి పంటలను కాపాడాలంటూ వేడుకోలు
- లేకుంటే ఆత్మహత్యలే దిక్కవుతాయని ఆవేదన

సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కారు. తమ భూములకు వెంటనే నీరందించాలని మంగళ వారం మంథని పట్టణంలోని పోచమ్మవాడ, మల్లెపల్లికి చెందిన రైతులు మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై.. అలాగే వరదకాలువను నింపాలని గంగాధర మండలంలోని కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు కరీంనగర్ – జగిత్యాల రహదారిలో కొండన్నపల్లి – కురిక్యాల మధ్య వరదకాలువ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై కన్నెర్రజేశారు. చేతికందే దశలో ఉన్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

మార్పు అంటే రైతుల ఆత్మహత్యలా..?

- రైతులను నమ్మించి గొంతు కోసిన్రు
- ప్రభుత్వ తప్పిదం వల్లే తీవ్ర నష్టం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పొలంలో కూర్చొని రైతులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, పుట్ట మధూకర్

ముత్తారం, మార్చి 26: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మార్పు వస్తుందని గొప్పలు చెప్పారని.. మార్పు అంటే 138 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడమా..? అని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహించారు. ఆత్మహత్యలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుకున్న రాష్ట్రంలో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని, రైతుల ఆత్మహత్యల కోసమేనా తెలంగాణ తెచ్చుకున్నామా..? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామంటూ రైతులను నమ్మించి గొంతు కోశారని మండిపడ్డారు. నీళ్లు లేక ఎండిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ముత్తారం మండలం సీతంపల్లి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో ఎండిన పంటలను మంగళవారం జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎండుతున్న పంటలను చూసి చలించిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. యాసంగి పంటలకు సాగునీరు ఇవ్వలేమని ముందుగానే ప్రకటిస్తే రైతులు ఇలా నష్టపోయే పరిస్థితి ఉండేది కాదని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు తప్పిదం వల్లే పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన చెందారు. కేసీఆర్ ప్రభుత్వంలో కరెంట్, సాగునీటి కష్టాలు లేవని, గతేడాది యాసంగి సమయంలో పుష్కలమైన నీరందించామని గుర్తు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, ఎంపీటీసీ అల్లం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

మార్పు అంటే ఇంత గొప్పగా ఉంటుందని ఎవరూ ఊహించలేదు. పదేళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో పాలనలో ఎలా ఉండేదో ఇప్పుడు అలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. రైతులను మళ్లీ రోడ్లపైకి తెచ్చి అరిగోస పెడుతున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి అన్నదాత కన్నీరు పెడుతుంటే.. ముఖ్యమంత్రి మాత్రం హోలీ సంబరాల్లో మునిగిపోయారు. రైతులు ఎన్ని కష్టాలు పడ్డా ఈ ప్రభుత్వానికి అవసరం లేదు. మేము మాత్రం అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఎండిన పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెబుతున్నాం. బీఆర్ఎస్ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి నష్టపరిహారం అందేలా పోరాటం చేస్తాం. న్యాయం జరిగే వరకు పోరాడుతాం.

- పుట్ట మధూకర్, పెద్దపల్లి జిల్లా జడ్పీ చైర్మన్

చివరి ఆయకట్టుకు నీళ్లివ్వండి

మంథనిలో పురుగుల మందు డబ్బాలు, ఎండిన వరితో రాస్తారోకో చేస్తున్న రైతులు

మంథని, మార్చి 26 : ఆరుగాలం కష్టించి పండించిన పంట చివరి దశలో ఎండిపోయే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడ, మల్లెపల్లికి చెందిన రైతులు మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిపై ట్రాక్టర్, ఆటోలు, బైక్‌లను అడ్డుగా పెట్టి పురుగుల మందు డబ్బాలు, ఎండిన వరి పైర్లను పట్టుకొని బైఠాయించారు. 'జై జవాన్.. జై కిసాన్' అంటూ నినదించడంతోపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొన్నేండ్లుగా కన్నాల ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా మంథని, అంగుళూరు, మల్లేపల్లి, నాగారం, విలోచవరం గ్రామ శివారుల్లో పంట పొలాలకు నీరందేదని, అలాగే ఎస్సారెస్పీ, గుండారం ప్రాజెక్టుల ద్వారా సైతం సరిపడా సాగునీరు వచ్చేదన్నారు. కానీ, ఇప్పుడు చుక్క నీరు రావడంలేదని, పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నాల ప్రాజెక్టు కాలువల వెంట రైతులు మోటర్లు పెట్టడంతో తమ పంటలు సాగు నీరందక పూర్తిగా ఎండిపోతున్నాయని, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే కన్నాల ప్రాజెక్టు కాలువ వెంట ఉన్న మోటర్లు తీయించడంతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకట కృష్ణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ధర్నాను విరమింపజేసే ప్రయత్నం చేయగా, రైతులు భీష్మించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ రైతు సీఐ కాళ్లు పట్టుకొని ప్రయత్నం చేయగా వారు అడ్డుకున్నారు. అధికారులు వచ్చి హామీ ఇస్తేగానీ ఇక్కడి నుంచి కదలమని చెప్పగా, ఇరిగేషన్ శాఖ ఈఈ బలరామయ్య వచ్చి రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కన్నాల ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువకు రైతులు మోటార్లు పెడుతున్న విషయం తమ దృష్టికి రాలేదని, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని, సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

1800 ఎకరాలు ఎండిపోయేటట్టు ఉన్నయి

గతంలో ఎన్నడు మాకు సాగునీటి సమస్యలు రాలేదు. ఏ కాలమైనా సరే పంటలకు పుష్కలంగా నీరందింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే సాగునీటి కరువు వచ్చింది. ఎస్సారెస్పీ కింద వారబందీ పద్ధతిలో

గుండారం ప్రాజెక్టు ద్వారా నీరందిస్తామని అధికారులు చెబితేనే మేం పంటలు వేశాం. తీరా పంటలు చేతికందివచ్చిన తర్వాత నీళ్లు ఇవ్వడం లేదు. నీళ్లు రావని ముందే చెప్తే అప్పు తెచ్చి పంటలు వేసేటోళ్లం కాదు కదా..? కన్నాల ప్రాజెక్టు కాలువకు మోటర్లు పెట్టడుతోటే మా పొలాలకు నీళ్లొస్తలేవు. దాదాపు 1800 ఎకరాలు ఎండి పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలి.

- సత్యనారాయణ, రైతు (మంథని)

గతంల ఎన్నడూ ఇబ్బంది కాలె

అధికార పార్టీ అండదండలతో ఆ పార్టీకి చెందిన కొంత మంది రైతులు నీళ్లను అక్రమంగా

తరలించుకుపోతున్నరు. ఎన్నోఏండ్లుగా కన్నాల ప్రాజెక్టు కెనాల్, ఎస్సారెస్పీ కాలువ, గుండారం రిజర్వాయర్ ఆధారంగానే మేం పంటలు సాగు చేస్తున్నం. గత పదేండ్లలో ఎప్పుడూ సాగునీళ్లకు ఇబ్బంది రాలె. కానీ కొత్త ప్రభుత్వం వచ్చుడేందోగానీ.. కరువు మొదలైంది. కన్నాల ప్రాజెక్టు నుంచి మాకు వచ్చే నీటిని రానివ్వట్లేదు. అధికార పార్టీ అండదండలతో కొందరు కెనాల్ మీద మోటర్లు పెట్టుకొని నీటిని తరలించుకుపోతున్నరు. అధికారులు వెంటనే స్పందించి మోటర్లు తొలంచాలి.

- ఎరుకల రవి, రైతు (మల్లేపల్లి)

రైతులతో మాట్లాడుతున్న ఈఈ బలరాం

నీళ్లత్తనే పంట చేతికత్తది

ఐదేండ్ల సంది వరదకాలువను నమ్ముకుని పంటలు సాగు చేస్తున్నం. ప్రతి సారి రంది లేకుంట ఉండె. అప్పటి సర్కారు టైముకు నీళ్లిచ్చిది. అదే

నమ్మకంతోని ఈసారి కూడా నాలుగు ఎకరాలల్ల వరేసిన. సర్కారు నీళ్లు ఇడువకపోవడంతో వరదకాలువల నీళ్లు లేక మోటర్లు తేలినయి. మొన్న కాలువకు నీళ్లు ఇడిసినట్టె ఇడిసి బందువెట్టిన్రు. ఈ రెండరోజులల్ల నీళ్లత్తెనే పంట సేతికత్తది. లేకుంటే గింజలు చేతుకు రాక పెట్టుబడి కూడా నష్టపోతం.

మామాడిపెల్లి రాజశేఖర్, రైతు (కొండన్నపల్లి)

వరద కాలువను నింపండి

గంగాధర, మార్చి 26 : వరద కాలువకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని గంగాధర మండలంలోని కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు రోడ్డెక్కారు. కరీంనగర్ – జగిత్యాల రహదారిలో కొండన్నపల్లి – కురిక్యాల మధ్య వరదకాలువ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము వరద కాలువపై ఆధారపడి యాసంగి పంటలు సాగు చేశామని, ప్రస్తుతం పొలాలు పొట్టదశలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరదకాలువకు ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో నీరు అడుగంటి సాగునీటి కష్టం వచ్చిందని ఆవేదన చెందారు. మూడు రోజుల క్రితం సాగునీటి కోసం తాము ధర్నా చేయడానికి ప్రయత్నిస్తే నీటిని విడుదల చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారని, దీంతో తాము ధర్నా విరమించినట్లు గుర్తు చేశారు. కాగా, మూడు రోజులైనా నీళ్లు రాకపోవడంతోనే ఆందోళనకు దిగినట్లు చెప్పారు. వరదకాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. నీరు ఇవ్వకుంటే పంటలు ఎండిపోయి తీవ్రనష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందే చెప్తే పంటలు సాగు చేసేవారిమి కాదని, నీటిని విడుదల చేస్తామని చెప్పి సమయానికి విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ కిరణ్‌రెడ్డి రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

జగిత్యాల రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కండ్లముందే ఎండిపోతున్నయి

సాగు నీరు అందక వేసిన పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే ఏం చేసుడో అర్థమైతలేదు. కొండన్నపల్లి శివారుల మాకు ఆరున్నర ఎకరాల వ్యవసామ భూమి ఉంది. ఐదేళ్లుగా వరదకాలువను నమ్ముకుని పంటలు సాగు చేస్తున్న. ఈ ఐదేళ్లు కరువన్నదే లేదు. వరదకాలువల యేడాదంతా నీళ్లు ఉండేటియి. మొగులు ముఖం చూడకుంట పొలాలు సాగు చేసినం. ఈ యేడాది కాంగ్రెస్ సర్కారు నీళ్లు విడుదల చేయకపోవడంతో ఉన్న నీళ్లు అడుగంటినయి. ఒకటి రెండు రోజుల్లో నీళ్లు వస్తే పంట దక్కినట్టు.. లేకుంటే నోట్లో మట్టిపడ్డట్టే. **- తొర్రికొండ కిషన్, రైతు (కొండన్నపల్లి)**

అర్వింద్ సోషల్ మీడియా యాక్టర్

- ఐదేండ్లలో ఆయన చేసింది శూన్యం
- చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కాంగ్రెస్ ఎన్నికల స్టంట్ మాత్రమే
- జీవన్‌రెడ్డి ప్రజల చెవిలో పూలు పెడుతున్నడు
- నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి
- జగిత్యాల నియోజకవర్గంలో ప్రచారానికి శ్రీకారం

జగిత్యాల పట్టణ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

జగిత్యాల, మార్చి 26, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల రూరల్: 'నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఒక సోషల్ మీడియా యాక్టర్. కేంద్రంలో వారి పార్టీ అధికారంలో ఉన్న తన సెగ్మెంట్ పరిధిలో ఐదేండ్లలో పది రూపాయల పనిచేయలే. పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, కవితలను విమర్శించడం, అడ్డదిడ్డంగా మాట్లాడడం తప్ప ఆయనకు ఏది చేతకాదు' అని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులకు, బీజేపీ లీడర్లకు షుగర్ ఫ్యాక్టరీ అంశం ఎన్నికల స్టంట్‌గా మారిందని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తమని మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనడం ఆశ్చర్యంగా ఉందని.. అయినా ఫ్యాక్టరీ పాత డోర్లు తెరవడం తప్ప వారు చేసేదేంలేదని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేయాలని చూస్తున్న మాజీ మంత్రి, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాటలు ప్రజల చెవిలో పూలు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణవాణి బలంగా వినిపించాలన్నా, తెలంగాణ ఆత్మగౌరవం నిలబడాలన్న బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువాల్సిందేనని చెప్పారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని పొలస్తేశ్వరాలయంలో పూజలు చేసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం జగిత్యాల పట్టణంలోని బీఎల్ఎన్, దేవీశ్రీ గార్డెన్స్‌ల్లో జరిగిన జగిత్యాల రూరల్, అర్బన్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. సాయంత్రం రూబీ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందుల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండా ఎగురేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం తరపున ప్రశ్నించే గొంతుక అవుతానని స్పష్టంచేశారు. నిజామాబాద్ నియోజకవర్గ ప్రజలు అర్వింద్‌ను ఎంపీని చేసింది ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తప్పా, కేసీఆర్, కేటీఆర్, కవితలను తిట్టడానికి కాదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి షుగర్ ఫ్యాక్టరీ గురించి మొత్తం తెలుసని, వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు అప్పటి మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు చైర్మన్‌గా, షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ విషయంలో కమిటీ వేశారని, అందులో ఆయన సభ్యులుగా ఉన్నారని గుర్తుచేశారు. అప్పుడు జీవన్‌రెడ్డితోపాటు తాను ఎమ్మెల్యేగా సభ్యుడిగా ఉన్నానని, ఆ కమిటీ ప్రభుత్వ యాజమాన్యంలో ఫ్యాక్టరీ నడపలేమని, ప్రైవేట్ అధీనంలోనే నిర్వహించాలని నివేదిక ఇచ్చిందని, అన్నీ తెలిసిన జీవన్‌రెడ్డి ఇప్పుడు మళ్లీ కొత్తగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మోసపూరిత మాటలు చెప్పే నాయకులపై నాయకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉండి ప్రశ్నించే గొంతుక అని చెప్పి జీవన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. జీవన్‌రెడ్డి నిజామాబాద్‌కు సైతం పట్టభద్రుల నియోజకవర్గ ప్రతినిదేనని, ఆయన ఎన్నిసార్లు నిజామాబాద్‌కు వచ్చారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రాజ్యం తెచ్చామని మాట్లాడుతున్నారని, మరి రుణమాఫీ ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమాల్లో జగిత్యాల పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గట్టు సతీశ్, బాల ముకుందం, రాయికల్ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, జడ్పీటీసీ సభ్యుడు మహేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాధ రవీందర్ రెడ్డి, దశరథ రెడ్డి, శీలం ప్రియాంక ప్రవీణ్, యూత్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కత్రోజ్ గిరి, మహిళ అధ్యక్షురాలు కచ్చు లత పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్, బీజేపీల దర్మార్గమైన పాలనకు బుద్ధి చెప్పాలి. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ మూడు నెలల్లోనే ఎంతటి తేడా వచ్చిందో గుర్తించాలి. కరెంట్ లేదు, సాగునీరు లేదు, తాగునీరు లేదు, రుణమాఫీ, రైతుబంధు, పెన్షన్ల పెంపు లేదు. ఇదేం ప్రభుత్వం? రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన, రేవంత్ రెడ్డి వ్యవహారం సరిగా లేదు. ప్రజలను హామీలతో మోసం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకున్నా, చిన్నచిన్న సమస్యలతో దాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్‌కు సంస్కారం లేదు. అలాంటి వ్యక్తికి మరో అవకాశం ఇవ్వద్దు. బీఆర్ఎస్ అభ్యర్థికి లక్ష ఓట్లు పడేలా శ్రేణులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి.

- కే విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

పార్టీ కార్యకర్తలకు వెన్నంటి ఉంటా..

నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం మంత్రులు, ముఖ్యమంత్రిని కలవాల్సి వస్తుంది. అదే పద్ధతిలో మంత్రులను, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని అడిగా. అంతే తప్ప పార్టీ మారే ఉద్దేశం అస్సలు లేదు. నేను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే పనిచేస్తా. కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా వెన్నంటి నిలబడుతా. నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని గెలిపించి తీరుతా. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు రిపేర్ చేయకపోవడం వల్లే ఇప్పుడు సాగునీటికి, తాగునీటికి గోస వచ్చే ప్రమాదం ఏర్పడింది. ఎండే ప్రతి పంట చేనుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి, తెలంగాణ ఆత్మగౌరవ సాధన కోసం ప్రతి కార్యకర్త కంకణ బద్ధుడు కావాలి.

- డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

గులాబీ సైనికులది అభివద్ధి బాట

గులాబీ సైనికులకు ఎప్పుడు అధికార యావ లేదు. వారిది ఎల్లవేళలా అభివృద్ధి బాటమాత్రమే. కాంగ్రెస్ హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. ఇప్పటికీ రైతన్నలకు రైతుబంధు రాలేదు. పంటలకు సాగునీరు ఇవ్వలేని దైన్య పరిస్థితిలో ప్రభుత్వం ఉన్నది. పంటలు నష్టపోయి రైతులు వీధిన పడే పరిస్థితి తలెత్తింది. వృద్ధులకు పెన్షన్ డబ్బులు పెంచడం కాదు కదా..? ఉన్న పెన్షన్ సైతం వేయడం లేదు. ఇలాంటి పరిస్థితులకు కారణమైన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

- దావ వసంత, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు